

ఎదురుచూపులు.. ఎన్నాళ్లు?

రెండు నెలలైనా జాడలేని పట్టాపాస్‌పుస్తకాలు

- రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతులకు తప్పని నిరీక్షణ
- 'ఒరిజినల్' లేకుండా పంట రుణాలు ఇవ్వని బ్యాంకులు
- పాస్‌బుక్ కోసం 'ధరణి'లో రూ.300చార్జీ వసూలు
- జిల్లా వ్యాప్తంగా 4 వేలకుపైగా పుస్తకాలు పెండింగ్

కేసముద్రం, సెప్టెంబర్ 24 : వ్యవసాయ భూముల కొనుగోలు, బహుమతి, వారసత్వ రూపంలో పొందిన వారికి రెండునెలలుగా పట్టాదారు పాస్‌పుస్తకాలు అందడం లేదు. వ్యవసాయ భూముల క్రయవిక్రయాలు, ఇతర బదిలీ ప్రక్రియలన్నీ ధరణి పోర్టల్ ద్వారా నిర్వహిస్తున్నారు. ధరణి ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారికి పట్టాదారు పాస్‌పుస్తకం రావాల్సి ఉండగా ఇవి నిలిచిపోయాయి. 7,10,848 ఎకరాల విస్తీర్ణంలో మహబూబాబాద్ జిల్లా ఉండగా, ఇందులో 3,94,619 ఎకరాల భూమిని సాగు చేస్తున్నారు. ఇందులో 2,45,632 ఎకరాలు బావులు, కాల్వల కింద సాగు అవుతుండగా 1,48,897 ఎకరాల్లో వర్షాధార పంటలు పండిస్తున్నారు. ఆయా భూముల్లోని రైతులు తమ అవసరాల నిమిత్తం ఇతర రైతులకు తమ భూమిని విక్రయించడం చేస్తుంటారు. అలాగే కొంతమంది రైతులు తమ కుటుంబసభ్యుల పేరిట బహుమతిగా భూమి బదలాయిస్తారు. ఇవే కాకుండా రైతు మృతి చెందిన వారి కుటుంబసభ్యులు, వారసులు 'విరాసత్' ద్వారా భూమిని బదిలీ చేయించుకుంటున్నారు. మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా 18 మండలాల్లో 287 రెవెన్యూ గ్రామాలుండగా.. అన్ని మండల కేంద్రాల్లోని తహసీల్దార్ కార్యాలయాల్లో ధరణి రిజిస్ట్రేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ రిజిస్ట్రేషన్ కేంద్రాల్లో నెలకు 50 నుంచి 100 వరకు ధరణిలో భూ బదలాయింపు లావాదేవీలు నిర్వహిస్తున్నారు. ఇలా జిల్లా వ్యాప్తంగా 3 వేలకుపైగా పట్టాదారు పాస్‌పుస్తకాలు అందాల్సిన రైతులున్నట్లు సమాచారం. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో భూ క్రయవిక్రయాలు మందకొడిగా సాగుతున్నాయి. వేసవి కాలంలో ధరణి ద్వారా కొనుగోళ్ల అమ్మకాలు రెట్టింపు స్థాయిలో కొనసాగుతాయి.

రైతుల ఆవేదన..

ధరణి ద్వారా పట్టాదారు పాస్‌పుస్తకాలు అందక రెండు నెలలకుపైగా అవుతోంది. ధరణిలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తికాగానే వెంటనే ఆన్‌లైన్‌లో పట్టాపాస్‌పుస్తకం నెంబరు, రైతుపేరు, విస్తీర్ణం వివరాలను తహసీల్దార్ కార్యాలయంలో అందజేస్తున్నారు. అయితే పట్టాదారు పాస్‌పుస్తకం రైతు చిరునామాకు రిజిష్టర్ పోస్టులో రావాల్సిఉండగా రెండునెలలుగా అవి జారీ కావడంలేదు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో క్రయవిక్రయాలు, బహుమతి, వారసత్వం విభాగాల్లో స్లాట్ బుకింగ్ సమయంలో పట్టాదారు పాస్‌పుస్తకం కోసమని రూ.300ల చార్జీని ధరణి పోర్టల్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇవేకాకుండా పట్టాదారు పాస్‌పుస్తకాన్ని పోగొట్టుకున్న వారికి 'డుప్లికేట్ పీపీబీ' విభాగంలో రూ.300 చెల్లించి దరఖాస్తు చేసుకునే వీలుంది. జిల్లాలో పట్టాదారు పాస్‌పుస్తకాలు పోగొట్టుకున్న వారికి కూడా రెండు నెలలకుపైగా పట్టాదారు పాస్‌పుస్తకం అందలేదు. గతంలో వారం నుంచి 10 రోజుల్లోగా ఇంటికి పట్టాదారు పాస్‌పుస్తకం అందేది. ఇప్పుడు రెండు నెలలైనా పాస్‌బుక్ జాడలేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పుస్తకాలు అందక ఇబ్బందులు..

భూమి కొనుగోలు, బహుమతి, వారసత్వం రూపంలో మార్చుకున్న రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు అందకపోవడంతో రెండు నెలలు ఎదురుచూపులే మిగిలాయి. బ్యాంకుల్లో కొత్తగా పంట రుణాలు తీసుకునేందుకు బ్యాంకర్లు తప్పనిసరిగా రైతులను పట్టాదారు పాస్‌పుస్తకాలను అడుగుతున్నారు. ఒరిజినల్ పట్టాపాస్‌పుస్తకాలను బ్యాంకులో పెట్టుకొని పంట రుణాలను ఇస్తున్నారు.

పట్టాపాస్‌పుస్తకాలు లేకపోవడంతో భూమిని కొన్న కొత్త రైతులు, బహుమతిగా తీసుకున్నవారు, వారసత్వంగా పొందిన వారు కొత్త రుణాలకు దరఖాస్తు చేసే అవకాశం లేకుండాపోయింది. రుణాలు జారీ చేసే సీజన్ ముగుస్తుండడంతో తమకు పంటరుణం అందుతుందో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. పట్టాదారు పాస్‌పుస్తకాలు నేరుగా రాష్ట్రస్థాయిలోని ప్రింటింగ్ విభాగానికి ఆన్‌లైన్‌లోనే వెళ్లి ముద్రణ అనంతరం పోస్టుద్వారా రైతు ఇంటికి చేరుతాయి. జిల్లాలో రెండు నెలలుగా ఏ ఒక్కరికి కొత్తపాస్‌పుస్తకం అందలేదని, ప్రిటింగ్ విభాగంలోనే సమస్య ఉన్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమకు వెంటనే పట్టాదారు పాస్‌పుస్తకాలను అందించాలని రైతులు కోరుతున్నారు.

జూలై 10న గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేయించా..

- దూదిమెట్ల రాజేష్, పెనుగొండ



పెనుగొండ గ్రామంలోని రెండెకరాల వ్యవసాయ భూమిని మా నాన్న నుంచి బహుమతిగా ధరణిలో ఈ ఏడాది జూలై 10న రిజిస్ట్రేషన్ చేయించా. పది రోజుల్లో పట్టాపాస్‌పుస్తకం వస్తుందని చెప్పినప్పటికీ నేటి వరకు పాస్‌పుస్తకం ఇంటికి రాలేదు. బ్యాంకులో పంట రుణాన్ని ఒరిజినల్ పట్టా పాస్ పుస్తకం ఉంటేనే ఇస్తున్నారు. రెండునెలలకుపైగా పాస్‌పుస్తకం కోసం నిత్యం పోస్టాఫీసు వారిని విచారిస్తున్నా.

పాస్‌పుస్తకం కోసం ఎదురుచూస్తున్నా..

- రాజులపాటి రేణుక, ఇంటికన్నె



పట్టాదారు పాస్‌పుస్తకం దొరకకపోవడంతో డుప్లికేట్ పట్టాదారు పాస్‌పుస్తకం కోసం ఈనెల 11న ధరణిలో దరఖాస్తు చేశా. నేటికి పట్టాదారుపాస్‌పుస్తకం పోస్టులో రాలేదు. బ్యాంకులో పంట రుణం తీసుకునేందుకు పట్టాదారు పాస్‌పుస్తకం అడుగుతున్నారు. నా డుప్లికేట్ పాస్‌బుక్‌ను ఎక్కడుందో ట్రాక్ చేసే అవకాశం కూడా ధరణిలో చూపించడంలేదని దరఖాస్తు చేసిన వారు చెబుతున్నారు. అధికారులు స్పందించి త్వరితగతిన పట్టాదారు పాస్‌పుస్తకం ఇప్పించాలి.



వీసీలో పాల్గొన్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

ఓటరు నమోదును పకడ్బందీగా నిర్వహించాలి

- 28వ తేదీ నాటికి వందశాతం సర్వే పూర్తి చేయాలి
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి

మహబూబాబాద్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఓటరు నమోదు కార్యక్రమాన్ని కట్టుదిట్టంగా నిర్వహించాలని రాష్ట్ర ముఖ్యఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి సూచించారు. హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్లతో స్పెషల్ సమ్మరి రివిజన్ (ఎస్ఎస్ ఆర్)పై మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజులుగా నూతన ఓటరు నమోదుపై చేపట్టిన ఇంటింటి సర్వే పనితీరు చాలా మెరుగుపడిందని, ఇప్పటి వరకు 90 శాతంకుపైగా సర్వే పూర్తయిందని చెప్పారు. సెప్టెంబరు 28 నాటికి వందశాతం ప్రతీ పోలింగ్‌కేంద్రం పరిధిలో బూత్‌స్థాయి అధికారుల ద్వారా ఇంటింటి సర్వే పూర్తి చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫారం-6, ఫారం-7 ఫారం-8 దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. సెప్టెంబరు నెలాఖరు వరకు పెండింగ్ దరఖాస్తులను పూర్తి చేయాలన్నారు. ఇంటింటి సర్వేలో ఆధార్‌నెంబర్ సేకరణ తప్పనిసరి కాదని, ఓటర్లు ఇష్టముంటేనే ఇవ్వవచ్చని బలవంతం చేయరాదన్నారు. నూతన ఓటర్ల నమోదుకు సంబంధించిన అంశాలు రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలియజేయాలని సూచించారు. బీఎల్వో యాప్ వినియోగంపై బూత్‌స్థాయి అధికారులకు అవసరమైన శిక్షణ అందించాలని చెప్పారు. పోలింగ్‌కేంద్రాల క్రమబద్ధీకరణ ప్రక్రియ, డ్రాఫ్ట్ ఓటరు జాబితా ప్రచురణ అక్టోబరు 29లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ వీసీలో మానుకోట నుంచి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీవోలు అలివేలు, నర్సింహారావు, తహసీల్దార్లు భగవాన్‌రెడ్డి, సైదులు, డీసీవో వెంకటేశ్వర్లు, కలెక్టరేట్ ఏవో పవన్‌కుమార్ పాల్గొన్నారు.

జీపీ సిబ్బందికి నాలుగు రోజుల శిక్షణ

- మిషన్ భగీరథ గ్రిడ్ ఎస్ఈ సురేందర్

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబరు 24 : మహబూబాబాద్ మండలంలోని 41 గ్రామ పంచాయతీల నుంచి ఒక్కొక్క గ్రామ మంచినీటి సహాయకులకు నాలుగు రోజుల పాటు శిక్షణ ఇవ్వ నున్నట్లు మిషన్ భగీరథ గ్రిడ్ ఎస్ఈ సురేందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 24 మొదటి రోజు పైపులైన్‌ల లీకేజీ, 25న విద్యుత్ మోటార్ల రిపేర్, 26న మంచి నీటి నాణ్యత ప్రమాణాలపై, 27న బోర్‌వెల్ రిపేర్లపై శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. శిక్షణ అనంతరం గ్రామాల్లో ఆయా విభాగాల్లో వారు విధులు నిర్వహించనున్నట్లు చెప్పారు. జడ్పీ సీఈవో నర్మద, డీపీవో హరిప్రసాద్, కృష్ణారెడ్డి, శ్రీనివాసరావు, ఎంపీడీవో రఘుపతిరెడ్డి, ఏఈ శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సురేందర్

గిరిజన గురుకులాల ఆర్సీవో ఆఫీస్..

మానుకోటలోనే కొనసాగుతుంది

- పంచాయతీరాజ్ శాఖమంత్రి సీతక్క



మహబూబాబాద్, సెప్టెంబరు24 (ఆంధ్రజ్యోతి) : గిరిజన గురుకులాల రీజినల్ కో-ఆర్డినేటర్ (ఆర్సీవో) కార్యాలయం మహబూబాబాద్‌లోనే కొనసాగుతుందని పంచాయ తీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రయోజనాల దృష్ట్యా సబ్ రీజినల్ కో-ఆర్డినేటర్ ఆఫీస్‌ను ములుగులో ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. మహబూబాబాద్ జిల్లాలోని గిరిజన రీజినల్ కోఆర్డినేటర్ కార్యాలయం ములుగుకు తరలిస్తున్నారని తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని. వాటిని నమ్మవద్దని చెప్పారు. సబ్ రీజినల్ కోఆర్డినేటర్ ఆఫీస్ ములుగులో ఏర్పాటు చేస్తే అటు భూపాలపల్లి, ఇటు ములుగు జిల్లాల ప్రజలకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కొంతమంది వ్యక్తులు పని కట్టుకుని ఆర్సీవో కార్యాలయాన్ని మానుకోట నుంచి ములుగుకు తీసుకుపోతున్నారని తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని వివరించారు. ములుగు, మానుకోట జిల్లాలతో పాటు రాష్ట్ర అభివృద్ధిలో పాలు పంచుకుంటానని సీతక్క స్పష్టం చేశారు.

రేషనలైజేషన్ జీవోను సవరించాలి

- టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చుంచు శ్రీశైలం



కంకరబోడ్ పాఠశాలలో నిరసన ప్రదర్శన చేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 24 : ఉపాధ్యాయుల సర్దుబాటుకు విద్యాశాఖ జారీ చేసిన జీవో 25ను సవరించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చుంచు శ్రీశైలం డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని కంకరబోడ్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న రేషనలైజేషన్ ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూతపడిన పాఠశాలలను తెరిపిస్తామని ముఖ్యమంత్రి చేసిన ప్రకటనకు విరుద్ధంగా విద్యాశాఖ అవలంబిస్తున్న బడులను మూసివేసే విధానాలను ఉపసంహరించుకోవాలన్నారు. 11 మంది పిల్లలకు ఇద్దరే టీచర్లు, 60మంది పిల్లలకు కూడా ఇద్దరే టీచర్లు ఉండడం అసంబద్ధమని చెప్పారు. ఒక్కరు లేదా ఇద్దరు టీచర్లు ఐదు తరగతుల్లో 18 సబ్జెక్టులను బోధించడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ఉన్నత పాఠశాలల్లో 220 మంది విద్యార్థుల వరకు సబ్జెక్టుకు ఒక్క ఉపాధ్యాయుడినే ఉంచడం వల్ల పనిభారం పెరిగి విద్యాప్రమాణాలు మరింత దిగజారుతాయని గ్రహించాలని సూచించారు. తక్షణమే రేషనలైజేషన్ ఉత్తర్వులను సవరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిక్షపతి, సువర్ణ, శ్రీనివాస్, ఎరిరాం, మంగీలాల్, నరేష్, చంద్రమౌళి, కృష్ణమూర్తి, రవికుమార్, ప్రకాష్, అనసూర్య, స్వరూప, మంజుల, హరి, నాగరాజు పాల్గొన్నారు.

ఎఫ్‌పీసీ ఎంఈవోల నియామకం
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర విద్యాశాఖ
8

మచ్చర్ల స్టేజీ వద్ద 187 కిలోల గంజాయి పట్టివేత

- రెండు కార్లు సీజ్.. నలుగురిపై కేసు నమోదు
- పట్టుకున్న సరుకు విలువ రూ. 46.76లక్షలు
- వివరాలు వెల్లడించిన మానుకోట డీఎస్పీ తిరుపతిరావు



వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ తిరుపతిరావు

గూడూరు, సెప్టెంబరు 24 : మండలంలోని మచ్చర్ల వద్ద రెండు కార్లలో తరలిస్తున్న 187 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు తెలిపారు. కార్లు సీజ్ చేసి నలుగురిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. గూడూరు పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ కేసు వివరాలను వెల్లడించారు. స్థానిక పోలీసులకు ఎండు గంజాయి గూడూరు మీదుగా హైదరాబాద్‌కు తరలిస్తున్నారన్న పక్కా సమాచారంతో నర్సంపేట-మహబూబాబాద్ 365 జాతీయ రహదారి మచ్చర్ల స్టేజీవద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. అటువైపుగా వస్తున్న రెండు కార్లను ఆపి తనిఖీ చేయగా, అందులో 187 కిలోల ఎండు గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఒడిస్సా రాష్ట్రానికి చెందిన మల్కనిగిరి జిల్లా కలిమెల మండలం పులిమేటలకు చెందిన మండల నరేష్, ఇదే జిల్లాకు చెందిన బాపన్, చత్తీస్‌ఘడ్ రాష్ట్రం సుక్మా జిల్లా కుమ్మరాస్‌కు చెందిన రాహుల్ మజుందార్, ఇదే రాష్ట్రానికి చెందిన రాయ్పూర్ జిల్లా ఖేదురంకు చెందిన హరీష్‌యాదవ్ ముఠాగా ఏర్పడి గంజాయిని తరలిస్తున్నారని తెలిపారు. ఒడిస్సా నుంచి భద్రాచలం, ఇల్లందు, మీదుగా మహబూబాబాద్, గూడూరు నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్న క్రమంలో పక్కాసమాచారం మేరకు గూడూరు పోలీసులు మచ్చర్ల స్టేజీ వద్ద వాహనాల తనిఖీలో పట్టుకున్నట్లు చెప్పారు. సుమారు గంజాయి విలువ రూ.46,76,000 ఉంటుందని తెలిపారు. గంజాయి తరలిస్తున్న వారిలో మండల నరేష్, రాహుల్ మజుందార్, హరీష్ యాదవ్‌ను అదుపులోకి తీసుకోగా.. బాపన్ అనే వ్యక్తి పరారీలో ఉన్నట్లు వివరించారు. వారి వద్ద నుంచి మూడు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించి పెద్దమొత్తంలో గంజాయిని పట్టుకున్న గూడూరు సీఐ కోటబాబురావు, ఎస్సై గిరిధర్‌రెడ్డి, సిబ్బంది బిచ్యానాయక్, కుమారస్వామి, రాజేష్, ప్రణీత్, అమ్మలను డీఎస్పీ తిరుపతిరావు అభినందించారు. నార్కోటిక్ డీఎస్పీ సైదులు, సీఐలు సురేష్, రవీందర్ పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్ అకారణంగా దూషిస్తున్నారు

- మైనార్టీ కళాశాల విద్యార్థినుల ధర్నా

డోర్నకల్, సెప్టెంబరు 24 : ప్రిన్సిపాల్ అకారణంగా తమను దూషిస్తున్నారని ఆరోపిస్తూ మంగళవారం డోర్నకల్‌లోని మైనార్టీ కళాశాలకు చెందిన విద్యార్థినులు ఆందోళన చేపట్టారు. వివరాల్లోకెళ్తే. ప్రిన్సిపాల్ రాగసుధ దూషిస్తూ.. మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని మధ్యాహ్న భోజనం బంద్ చేసి, సుమారు 4గంటల పాటు కళాశాల ఆవరణలో ధర్నా చేపట్టారు. ఈ విషయం విద్యార్థినుల తల్లిదండ్రులకు తెలియడంతో కొందరు కళాశాల వద్దకు చేరుకున్నారు. పోలీసులు వారినిలోనికి అనుమతించకుండా అడ్డుకున్నారు. ఈ సమాచారం తెలుసుకున్న మైనార్టీ కళాశాల వరంగల్ రీజినల్ లెవల్ కోర్డినేటర్ రమేష్ ఖద్గర్ చేరుకుని విద్యార్థినులతో మాట్లాడి సమస్యను అడిగి తెలుసుకున్నారు. ప్రిన్సిపాల్‌ను బదిలీ చేయాలని విద్యార్థినులు నినాదాలు చేశారు. విద్యార్థినులు చెప్పిన విషయాలను నివేదికలో పొందుపరిచి, ఉన్నతాధికారులకు అందిస్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థినులు ఆందోళన విరమించారు.



డోర్నకల్ మైనార్టీ కళాశాలలో ధర్నా చేస్తున్న విద్యార్థినులతో మాట్లాడుతున్న వరంగల్ రీజినల్ కోఆర్డినేటర్ రమేష్ ఖద్గర్

ఏఎంసీ కమిటీ ఉత్తర్వులకు మార్కెటింగ్ శాఖ ఆమోదం

కేసముద్రం, సెప్టెంబర్ 24 : కేసముద్రం వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) నియామకంపై ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను మార్కెటింగ్ శాఖ ఆమోదించినట్లు ప్రత్యేక హోదా కార్యదర్శి అమరలింగేశ్వర్‌రావు మంగళవారం తెలిపారు. ఈ కమిటీలో చైర్మన్‌గా గంట సంజీవరెడ్డి, వైస్ చైర్మన్‌గా పెద్దబోయిన ఐలయ్య, సభ్యులుగా సంకెపల్లి నారాయణరెడ్డి, చిదిరాల వసంతరావు, వోలం రమేష్, చింతకుంట్ల యాదగిరి, ఎండీ.అయూబ్‌ఖాన్, భూక్య అనిత, గోపి మధుసూదన్, ఆవుల శ్రీనివాస్, గడ్డం వెంకట్‌రెడ్డి, కాకి విజయ, కొట్టం రాము, గుగులోత్ వీరన్నలను నియమిస్తున్నట్లు ఈనెల 21న జీవో నెంబర్ 694 విడుదలైందని తెలిపారు. ఈ జీవోను మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ జి.లక్ష్మీబాయి ఆమోదించినట్లు స్థానిక మార్కెట్‌కు ఆదేశాలు వచ్చినట్లు వెల్లడించారు.

ఏచూరి మరణం అన్ని వర్గాలకు తీరనిలోటు

ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ● కేయూలో సీతారాం సంస్మరణ సభ ● హాజరైన ప్రజాసంఘాల నేతలు, విద్యార్థులు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 24: సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సీతారాం ఏచూరి మరణం ప్రజాస్వామ్య వాదులకు, అన్ని వర్గాల ప్రజలందరికీ తీరనిలోటని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం కేయూక్యాంపస్‌లోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం సెమినార్‌హాల్‌లో ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా కమిటీ నేతృత్వంలో సీతారాం ఏచూరి సంస్మరణ సభ జరిగింది. ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా అధ్యక్షకార్యదర్శులు స్టాలిన్, మంద శ్రీకాంత్ అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.



సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నర్సిరెడ్డి, పుల్లా శ్రీనివాస్ తదితరులు

సీతారాం ఏచూరి గొప్ప ప్రజాస్వామ్యవాదని అని, ఆయన ఆశయాల సాధనకు ముందుకురావాలని పిలుపునిచ్చారు. దేశంలో ఆర్థిక, రాజకీయ సంక్షోభాలకు సోషలిజమే శాస్త్రీయ పరిష్కారం చూపుతుందని చెప్పారు. కమ్యూనిస్టులు కార్మిక, కర్షక వర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారని పేర్కొన్నారు. ఏచూరి మరణం దేశ ప్రజానీకానికి, కార్మిక, కర్షక వర్గాలకు తీరనిలోటని చెప్పారు. 2020 జాతీయ నూతన విద్యావిధానాన్ని రద్దు చేయాలని అన్నారు. దేశంలో విద్యతోనే అందరికీ ప్రజాస్వామ్య ఫలితాలను అందుతాయని చెప్పారు. ఆల్ ఇండియా వర్సిటీల సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ పుల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ.. అపర మేధావిగా, కమ్యూనిస్టు ఉద్యమ సారథిగా నిలిచిన సీతారాం ఏచూరి మరణం బాధాకరమన్నారు. సీపీఐ(ఎం) హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి బొట్ల చక్రపాణి మాట్లాడుతూ.. భవిష్యత్ అంతా కమ్యూనిస్టులదేనని చెప్పారు. వర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం గౌరవ అధ్యక్షుడు డాక్టర్ అంజన్‌రావు మాట్లాడుతూ.. యువతకు, కమ్యూనిస్టులకు సీతారాం ఏచూరి ఐకాన్‌గా నిలిచారని అన్నారు. సీఐటీయూ తెలంగాణ వర్సిటీల అధ్యక్షుడు మెట్టు రవి మాట్లాడుతూ.. కార్మిక వర్గాల స్ఫూర్తి ప్రదాత ఏచూరి అన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు స్టాలిన్, మంద శ్రీకాంత్ మాట్లాడుతూ.. ఏచూరి ఆశయాల సాధనకు ఎస్ఎఫ్ఐ ముందుండి పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. విద్యార్థి ఉద్యమాలకు ఏచూరి అద్యుడని చెప్పారు. జేఎన్‌యూ కేంద్రంగా ఆయన చేసిన పోరాటం, అప్పటి ప్రధాని ఇందిరాగాంధీని ఎదురించిన ధీరత్వాన్ని కొనియాడారు. సభా ప్రారంభంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి అతిథులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ కార్యక్రమంలో సీఐటీయూ వర్సిటీ నేత కచ్చకాయల చిరంజీవి, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కల్యాణ్, అనూష, సహాయ కార్యదర్శులు జస్వంత్, పరిమళ, కేయూ అధ్యక్షుడు సాయి కిరణ్, నాయకులు కుమార్, సాయి, రాహుల్, కావ్య, ప్రవళిక, అనూష, ప్రదీప్, శిరీష, సందీప్, రాజ్‌కుమార్, వివిధ విద్యార్థి, ప్రజా సంఘాల నేతలు పాల్గొన్నారు.

ఇంతకీ ఆయనెవరు?

సాధారణ వ్యక్తికి బల్దియా సమావేశం వద్ద గౌరవమర్యాదలు

చర్చనీయాంశమైన పోలీసు అధికారి తీరు.. సోషల్ మీడియాలో వైరల్

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 24: నగరంలో వివాదాస్పదుడిగా ముద్రపడిన ఓ సాధారణ వ్యక్తికి బల్దియా సమావేశం సందర్భంగా ఇచ్చిన గౌరవ మర్యాదలు చూసి ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. అసలు ఆయన ప్రజాప్రతినిధి కానేకాదు. ఆయనకూ మంగళవారం జరిగిన బల్దియా కౌన్సిల్ సమావేశానికి ఎలాంటి సంబంధం లేదు. ఆహ్వానం లేకపోయినా తన ఇద్దరు గన్‌మెన్‌లతో బల్దియా కార్యాలయానికి వచ్చాడు. ఇంకేముంది.. అక్కడి మెయిన్ గేట్ నుంచి సమావేశ మందిరం వరకు పోలీసులు కూడా గౌరవ మర్యాదలిస్తూ తీసుకెళ్లారు. ఓ పోలీసు అధికారి అయితే.. సదరు వ్యక్తి వస్తున్నాడన్న విషయం తెలుసుకుని సిబ్బందితో కలిసి ప్రధాన ద్వారం వద్దకు ఎదురేగి మరీ స్వాగతం పలికారు. తానే ముందుండి మరీ ఆయన్ను సమావేశ మందిరంలోకి తీసుకెళ్లారు. అంతేకాదు.. ఆయనే దగ్గరుండి సదరు వ్యక్తికి కమిషనర్ కార్యాలయం పక్కనే ఉన్న గదిలో విశ్రాంతి కల్పించారు. కౌన్సిల్ కార్యాలయానికి వంద మీటర్ల దూరంలోనే సాధారణ ప్రజలు, మహిళా కార్పొరేటర్ల భర్తలు, వారి సహచరులను కూడా అనుమతించని పోలీసులు ఆ వ్యక్తికి రాచమర్యాదలు చేసి మరీ అనుమతించడం, ఆయనతో పాటు 20మంది అపరిచితులను కూడా రానివ్వడం చర్చనీయాంశమైంది. ఓ సాధారణ వ్యక్తికి ఇలా ప్రాధాన్యం ఇవ్వడం, ఓ పోలీసుఅధికారి ఆయనకు ఇచ్చిన గౌరవమర్యాదల గురించి సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. కొంత కాలంగా సదరు పోలీసు అధికారి ఆ సాధారణ వ్యక్తి గురించి మీడియా, ప్రజల సమక్షంలోనే పొగడ్తలతో ముంచెత్తడం వివాదాస్పదంగా మారింది. రాజకీయ నాయకులకు కొమ్ముకాస్తుండడం తెలిసి పోలీసు ఉన్నతాధికారులు సైతం ఆయనపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్న చర్చ జరుగుతోంది. దీనిపై సీపీ ఏ నిర్ణయం తీసుకుంటారో చూడాల్సిందే మరీ.



ఎమ్మెల్సీ కోదండరామ్‌ను పూలమాలలతో సన్మానిస్తున్న టీజీవోలు

ఎమ్మెల్సీ కోదండరామ్‌కు టీజీవోల సన్మానం

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబర్ 24: హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞానభవన్‌లో మంగళవారం తెలంగాణ ఉద్యోగ, గెజిటెడ్ ఆఫీసర్స్, టీచర్స్, వర్కర్స్, పెన్షనర్స్ జేఏసీ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ కోదండరామ్‌ను సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమంలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్‌ను ఉమ్మడి వరంగల్ జిల్లా తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ (టీజీవో) అసోసియేషన్ నాయకులు పూలమాలలతో సన్మానించారు. ఎమ్మెల్సీని సన్మానించిన వారిలో టీజీవోస్ ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ ఎన్నమనేని జగన్‌మోహన్‌రావు, జనగామ జిల్లా అధ్యక్షుడు అమ్జద్ అలీ, హనుమకొండ జిల్లా కార్యదర్శి డాక్టర్ ప్రవీణ్‌కుమార్, నాయకులు రాజేష్ కుమార్, ఆస్నాల శ్రీనివాస్, నాగ నారాయణ, కృష్ణార్జునరావు ఉన్నారు.

నేడు వర్సిటీ మహిళ ఇంజనీరింగ్ కళాశాల అవిర్భావ వేడుకలు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 24: కాకతీయ యూనివర్సిటీ మహిళ ఇంజనీరింగ్ కళాశాల 11వ అవిర్భావ దినోత్సవ వేడుకలను వర్సిటీ సెనెట్ హాల్‌లో నిర్వహిస్తామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భిక్షాలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 25న బుధవారం 9.30 గంటలకు ప్రారంభమయ్యే వేడుకలకు కేయూ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ, సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ డాక్టర్ ఎస్.నాగవాణి, గౌరవ అతిథులుగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఈసీ మెంబర్ బి.సురేశ్‌లాల్, వర్సిటీ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్, ఈసీ మెంబర్ డాక్టర్ నిమ్మ. సుదర్శన్, ఈసీ మెంబర్ డాక్టర్ బి.రమారెడ్డి, ఈసీ మెంబర్ డాక్టర్ చిర్ర రాజు హాజరుకానున్నట్లు తెలిపారు. సభలో కన్వీనర్‌గా ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్‌గా బి.కిరణ్‌కుమార్ వ్యవహరిస్తారు.

హెడ్‌కానిస్టేబుల్ జయరాజ్‌కు స్ఫూర్తి సేవా రత్న జాతీయ అవార్డు



మడికొండ, సెప్టెంబరు 24: మడికొండ పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ గుండబత్తిన జయరాజ్‌ను భారతీయ స్ఫూర్తి సేవారత్న జాతీయ అవార్డు వరించింది. బాలల రక్షణ, ప్రజారోగ్యం, మానవహక్కుల వంటి అనేక సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా జయరాజ్ సేవలను గుర్తించిన స్ఫూర్తి సర్వీసెస్ సొసైటీ ఇండియా ఎన్‌జీవో వారు అవార్డును ప్రకటించారు. ఈ సందర్భంగా జయరాజ్‌ను పలువురు అభినందించారు. ఈనెల 29న హైదరాబాద్ కింగ్ కోఠిలోని సరస్వతి పరిషత్ ఆడిటోరియంలో ప్రముఖుల చేతుల మీదుగా అవార్డును అందుకోనున్నట్లు స్పష్టం చేశారు.

పిడుగుపడి వృదుడి మృతి



దుర్గం లక్ష్మయ్య(ఫైల్)

కొత్తగూడ, సెప్టెంబర్ 24 : కొత్తగూడ మండలం బత్తుల పల్లి శివారు మంగళవారం పిడుగుపడి దుర్గం లక్ష్మయ్య (65) మృతి చెందాడు. కార్లాయి, బత్తులపల్లి గ్రామాల మధ్య మధ్యాహ్నం అకస్మాత్తుగా ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. పొలం వద్దకు కాపలాకు వెళ్లిన లక్ష్మయ్యపై పిడుగు పడడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతుడికి భార్య ఎల్లమ్మ, ఇద్దరు కూతుళ్ల ఉన్నారు.

జనం నాడి.. డాక్టర్ ఆమెడ..

● ప్రజావైద్యుడిగా చిరస్మరణీయుడు ● మానవతకు నిలువెత్తు నిదర్శనం ● నేడు డాక్టర్ ఆమెడ నారాయణ వర్ధంతి

హనుమకొండ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా గీసుగొండ మండలం మొగిలిచెర్లలో 26 ఏళ్ల కిందట జరిగిన ఓ అమానవీయ సంఘటన తాలూకు గాయం ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజల గుండెల్లో ఇప్పటికీ పచ్చిగానే ఉంది. సరిగ్గా ఇదే రోజు (1996 సెప్టెంబర్ 25)న ప్రజా వైద్యుడు డాక్టర్ ఆమెడ నారాయణను కొందరు అంగతుకులు నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపిన సంఘటన ప్రజల జ్ఞాపకాల్లో సుడులు తిరుగుతూనే ఉంది. మొగిలిచెర్ల పేరు వినగానే నాటి నెత్తుటి దృశ్యం కళ్లకు కట్టినట్టు కనిపిస్తూనే ఉంటుంది. డాక్టర్ నారాయణ మొగిలిచెర్ల ప్రజల మనసుల్లో ఓ మనసున్న డాక్టర్‌గా, ప్రజాసేవకుడుగా ఇప్పటికీ నిలిచే ఉన్నాడనడానికి అక్కడ ఏ ఇంటి తలుపుతట్టినా వినిపిస్తుంది. ఆమెడ 28వ వర్ధంతి సందర్భంగా గత జ్ఞాపకాలు.

పేదరికాన్ని జయించి..

ఆమెడ నారాయణ నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన వారు. 1957లో ప్రస్తుత మహబూబాబాద్ జిల్లా కురవి గ్రామంలో తల్లిదండ్రులు మహాలక్ష్మీ, ముత్తయ్యలకు జన్మించారు. ఆరుగురు సంతానంలో ఆయన రెండోవారు. నారయణ పాఠశాల విద్యాభ్యాసం కురవిలోనే సాగింది. అనంతరం మహబూబాబాద్ జూనియర్ కాలేజీలో ఇంటర్ విద్య పూర్తి చేశాడు. ఆ తర్వాత హనుమకొండ సుబేదారిలో ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో డిగ్రీ చదువుతుండగానే మెడికల్ ఎంట్రెన్స్‌రాసి కాకతీయ వైద్యకళాశాలలో సీటు పొందాడు.

కార్యక్షేత్రం మొగిలిచెర్ల

అన్న నాగయ్య వామపక్ష భావజాలం నారాయణను ప్రభావితం చేసింది. విద్యార్థిగా ఉన్నప్పుడే ఎస్ఎఫ్ఐ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొన్నారు. ఆనాడు వరంగల్ విద్యార్థి యువజన, మేధావి వర్గాల్లో ప్రభావం చూపిన విప్లవోద్యమం ఆయనను కదలించింది. ఇదే అప్పటి సుప్రసిద్ధ ప్రజాహక్కుల నేత, పిల్లల డాక్టర్ రామనాథంకు దగ్గర చేసింది. ప్రజలకు సేవ చేయాలనే సంకల్పం,



నిబద్ధతను ఆయన నుంచే అందిపుచ్చుకున్నారు. ఎంబీబీఎస్ పూర్తిగానే డాక్టర్ ఆమెడ వైద్యాన్ని ఒక వృత్తిగా కాక సేవగా ఎంచుకున్నారు. అందుకు కార్యక్షేత్రంగా ప్రస్తుతం వరంగల్ జిల్లాలోని గీసుగొండ మండలం మొగిలిచెర్ల గ్రామాన్ని ఎంచుకున్నారు. ప్రజల కోసం పరితపించే పిల్లల వైద్యుడు రామనాథం చేతుల మీదుగా తన ప్రజావైద్యశాలను ప్రారంభించారు.

అప్పుడై..

అనతికాలంలోనే మొగిలిచెర్ల, దాని చుట్టు పక్కల 40 గామాల్లోకు దేవుడుగా మారారు. ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు అవిశ్రాంతంగా వైద్య సేవలను అందించారు. వృత్తిధర్మం పట్ల ఎనలేని నిబద్ధత కలిగిన డాక్టర్ నారాయణ.. ఒక విశిష్టమైన దృక్పథాన్ని కలిగి ఉన్నప్పటికీ తరతమ భేదం లేకుండా అన్నివర్గాల ప్రజలకు సేవలు అందించారు. నక్సల్స్ మొదలు పోలీసుల వరకు అందరూ ఆయన వద్ద వైద్య సేవలు పొందినవారే.

రోగుల సేవలో..

వృత్తిధర్మాన్ని చూడలేని రాజ్యానికి ఆయన శృతువయ్యారు. అనేక సార్లు బెదిరింపులు ఎదుర్కొన్నాడు. అయినా ఏనాడు అదరలేదు. బెదరలేదు. ప్రజలకు అందుబాటులో ఉండాలని మొగిలిచెర్లలోనే భార్యాబిడ్డలతో మకాం పెట్టి, అనివార్య పరిస్థితుల్లో 1995లో తన నివాసాన్ని హనుమకొండలోని తన సొంత ఇంటికి మార్చుకున్నాడు. నివాసమైతే మారింది కానీ, ఆయన మనసెప్పుడు మొగిలిచెర్లలోని తన ప్రజావైద్యశాలకు వచ్చే రోగులమీదు ఉండేది. ప్రతీ రోజు ఉదయం 6 గంటలకే బయలు దేరి రాత్రి 9 గంటల వరకు రోగులకు సేవలు అందించేవారు. ప్రజలకోసం పనిచేసే వాళ్లంటే రాజ్యవ్యవస్థకు కంటగింపు. ప్రయాణంలో కూడా మార్గమధ్యలో రోగులు కనబడితే ఆగి వారికి మందులిచ్చే స్వభావం నారాయణది. ఆయనను చంపాలని పథకం వేసుకున్నవారు దీనిని అవకాశంగా తీసుకున్నారు.

ఆ రోజు..

1996 సెప్టెంబరు 25-సరిగ్గా అదే రోజు డాక్టర్ నారాయణ రోజువారిలాగానే ఉదయం స్కూటర్‌పై మొగిలిచెర్లకు వెళుతున్నాడు. మార్గమధ్యలో ఏనుమాముల మార్కెట్ వద్ద రోడ్డు పక్కన కాపు కాసిన అగంతుకుల్లో ఒకరు ఎదురువచ్చాడు. కడుపునొప్పితో విలవిలలాడుతున్నట్టు నటించాడు. నిజమేనని నమ్మిన డాక్టర్ నారాయణ.. ఆగి పరీక్షిస్తుండగా వెనుక నుంచి ఆయనపై తూటాల వర్షం కురిసింది. ఆయన అక్కడికక్కడే కుప్పకూలాడు. నారాయణ హత్యావార్త దావానంలా వ్యాపించింది. చుట్టు పక్కల గ్రామాల నుంచి వేలాది మంది తరలివచ్చారు. మొగిలిచెర్ల శోకసముద్రమైంది. డాక్టర్ నారాయణ హత్యావార్త విన్న ప్రజలు, ముఖ్యంగా మహిళలు కనబరిచిన నిరసన అపూర్వం. కన్నీరుమున్నీరుగా విలపించిన ఆ జన సమూహమే డాక్టర్ ఆమెడకున్న ఆదరణకు సాక్ష్యం. భౌతికంగా డాక్టర్ నారాయణను లేకుండా చేసినా 30 ఊర్ల ప్రజల హృదయాల్లో ఇప్పటికీ నిలిచే ఉన్నారు. డాక్టర్ నారాయణ ఆదర్శాన్ని బతికించే కృషిలో ఆయనను సజీవంగా నిలుపుకోవడం కంటే మించిన నివాళి మరొకటి ఉండదు. డాక్టర్ నారాయణ అమరుడు. ఆయన ఆశయాలు నిరంతరం స్ఫూర్తిదాయం.

దామగుండం అడవిని కాపాడుకుందాం

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 24: దామగుండం అడవిని కాపాడుకొని ప్రకృతి వైపరిత్యాలు జరుగకుండా రాష్ట్రాన్ని కాపాడుకుందామని డీఎస్‌ఏ రాష్ట్ర కన్వీనర్ శ్రవణ్ పిలుపునిచ్చారు. దేశభద్రత పేరుతో వికారాబాద్ జిల్లాలోని దామగుండం రిజర్వ్ అడవుల్లో ఫ్రీక్వెన్సీ రాడార్ స్టేషన్ ఏర్పాటును నిరసిస్తూ డీఎస్ఏ ఆధ్వర్యంలో హనుమకొండలోని అశోకా జంక్షన్‌లో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు.



అశోకా జంక్షన్‌లో ఆందోళన చేస్తున్న డీఎస్ఏ నాయకులు

ఈ సందర్భంగా శ్రవణ్ మట్లాడుతూ.. మూడువేల ఎకరాల్లో విస్తరించి దామగూడెం అడవుల్లో వణ్యప్రాణులు, ఔషద మొక్కలతో పాటు లక్షల వృక్షాలు పర్యావరణ హితంగా ఉన్నాయన్నారు. ఇంత పెద్ద రిజర్వ్ ఫారెస్టును తొలగించి రాడార్ స్టేషన్‌ను ఏర్పాటు చేయడం సరికాదన్నారు. రాడార్ స్టేషన్ వల్ల విడుదలయ్యే రేడియేషన్ ద్వారా సమీప గ్రామాల ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదముందన్నారు. ప్రభుత్వం వెంటనే రాడార్ స్టేషన్ ఏర్పాటును ఉపసంహరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం కోకన్వీనర్ గణేష్ నాయకులు శివ, శరత్, అనిల్, అభినయ్, శిరీష చందన, కళ్యాణి, జయరాం, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐల్లో ఐదో విడత ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 24: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో ఐదోవిడత ప్రవేశాలకోసం దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా వరంగల్, హనుమకొండ ప్రభుత్వ ఐటీఐల ప్రిన్సిపాళ్లు ఎం.చందర్, జి.సక్రు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంబంధిత వెబ్ పోర్టల్‌లో ఈ నెల 28 వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు ప్రభుత్వ ఐటీఐల్లో సంప్రదించాలని వారు కోరారు.

వయోవృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకోవాలి

సుబేదారి, సెప్టెంబరు 24: అక్టోబరు 1న అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని నిర్వహించుకోవాలని మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ జిల్లా అధికారి బి.రాజమణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25 నుంచి అక్టోబరు 1 వరకు వయోవృద్ధుల వారోత్సవాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 26న వృద్ధాశ్రమాల్లోని వయోవృద్ధులకు క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు, 27న వాకతాన్ ర్యాలీ, 28న తల్లిదండ్రుల పోషణ, సంక్షేమ చట్టం- 2007, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన సదస్సు, 29న పంచాయతీ సెక్రటరీలకు తల్లిదండ్రుల పోషణ, సంరక్షణ చట్టం- 2007 అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఎల్డర్ లైన్ టోల్ ఫ్రీ నంబర్ 14567పై అవగాహన సదస్సు, ఈనెల 30న అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో గ్రాండ్ పేరెంట్స్ డే నిర్వహణ చేపట్టనున్నట్లు రాజమణి పేర్కొన్నారు. అక్టోబరు 1న జిల్లా స్థాయిలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని నిర్వహిస్తామని పేర్కొన్నారు.

నేటి నుంచి జంతుశాస్త్రంలో జాతీయ సదస్సు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 24: సెప్టెంబరు 25, 26 తేదీల్లో రెండు రోజుల పాటు 'రీసెంట్ ట్రెండ్స్ ఇన్ ఎనిమల్ బయోటెక్నాలజీ 'అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు విభాగాధిపతి ప్రొఫెసర్ జి.షమిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సుకు ముఖ్యఅతిథిగా కేయూ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ, హైదరాబాద్ స్కూల్ ఆఫ్ మెడికల్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కెగీతా వేముగంటిలు హాజరై కీలక ప్రసంగం చేస్తారని పేర్కొన్నారు. గౌరవ అతిథిగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి పాల్గొంటారని తెలిపారు. అందరూ హాజరై సదస్సును విజయవంతం చేయాలని ఆమె కోరారు.

అజర ఆస్పత్రిలో కార్డియాలజీ దినోత్సవం

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 24: హనుమకొండలోని ములుగురోడ్‌లోని అజర ఆస్పత్రిలో ప్రపంచ కార్డియాలజీ దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఈ నెల 29 వరకు ప్రత్యేక ఆరోగ్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆస్పత్రివర్గాలు వెల్లడించాయి. హృదయ సంబంధిత ఆరోగ్యాన్ని పెంపొందించేందుకు అజర హాస్పిటల్స్ ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు పరీక్షలను ఉచితంగా అందజేస్తున్నట్లు పేర్కొన్నారు.

సమాజ పురోభివృద్ధిలో ఎన్‌ఎస్ఎస్ వలంటీర్ల కృషి గొప్పది

ఎన్ఎస్ఎస్ అవిర్భావ వేడుకల్లో కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 24: సమాజ పురోభివృద్ధిలో జాతీయ సేవ పథకం (ఎన్ఎస్ఎస్) వలంటీర్ల కృషి గొప్పదని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ఉద్బోధించారు. మంగళవారం కేయూ సెనెట్ హాల్‌లో కేయూ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ అధ్యక్షత జరిగిన ఎన్ఎస్ఎస్ అవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ వల్లారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వలంటీర్ల స్వీయ క్రమశిక్షణ కలిగి ఉండాలని, స్వచ్ఛత రోజువారి దినచర్యలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. పనిని దైవంగా భావించాలన్నారు. చిన్న పనలు చేసేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. వలంటీర్ల కరిక్యూలమ్‌లో సేవ ప్రధాన భాగమని చెప్పారు. ఏడాదిలో ఒక్కో వలంటీర్ 120గంటల పాటు సమాజ సేవ కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని గుర్తు చేశారు. సమాజ రుగ్మతలను రూపుమాపాలని చెప్పారు. సేవలో భాగమే స్వచ్ఛత అని చెప్పారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లతోనే సమాజంలో మంచి మార్పులు వస్తాయని పేర్కొన్నారు. ట్రాఫిక్ నిర్వహణ, బాలికల సంరక్షణ, నిఘా కెమెరాలు, స్వచ్ఛ భారత్‌పై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. వర్సిటీ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్ మాట్లాడుతూ.. యువత స్వామి వివేకానంద, మదర్ థెరిస్సా లాంటి మహానుభావులను రోల్ మోడల్‌గా తీసుకుని జీవితంలో ఎదగాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులను గౌరవించుకోవాలని కోరారు. ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్.ప్రసాద్ మాట్లాడుతూ.. మంచి సమాజ నిర్మాణంలో వలంటీర్లు నిజమైన సైన్యమని చెప్పారు. కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.అమరవేణి, ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏటీబీటీ ప్రసాద్, వివిధ కళాశాల ఎన్ఎస్ఎస్ పీవోలు, వలంటీర్లు పాల్గొన్నారు.


హోరెత్తించిన సాంస్కృతిక ప్రదర్శనలు

ఎన్ఎస్ఎస్ అవిర్భావ వేడుకలను పురస్కరించుకుని ఎన్ఎస్ఎస్ వలంటీర్లు మంగళవారం కేయూ సెనెట్‌హాల్‌లో చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు, నృత్యాలు హోరెత్తించాయి. తెలంగాణ భాష, యాసలతోపాటు గిరిజన, కోయ సంస్కృతిని ప్రతిబింబించే నృత్య ప్రదర్శనలు చేశారు. తెలంగాణ బోనాలు, ఆదివాసీ నృత్యాలు, మిమిక్రీలు అంశాల్లో విద్యార్థులు పోటాపోటీగా ప్రదర్శనలు, నృత్యాలు చేశారు. యూనివర్సిటీ క్యాంపస్, వరంగల్ తూర్పు టీటీడబ్ల్యూఆర్‌డీసీ, ఆర్ట్స్ కళాశాల డిగ్రీ కళాశాల వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

గంగ పుత్రులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి

ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

బాలసముద్రం, సెప్టెంబరు 24: గంగ పుత్రులు (బెస్త) అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ పిలుపునిచ్చారు. మంగళవారం హనుమకొండలోని తారా గార్డెన్‌లో 14వ గంగపుత్ర (బెస్త) నిర్మాణ సంస్థ ఎంఏసీ హౌసింగ్ సొసైటీ జనరల్ బాడీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఎమ్మెల్యే ముఠా గోపాల్ హాజరై మాట్లాడారు. గంగ పుత్ర కుటుంబ సభ్యుల భవిష్యత్ కోసం సంఘం అండగా ఉంటుందన్నారు. గంగపుత్ర జాతి అభ్యున్నతి కోసం కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. సంఘంలో అందరు రిజిస్ట్రేషన్‌లు పూర్తి చేసుకున్నట్లు తెలిపారు. ఏ సంఘానికి కూడా లేని 120 ఎకరాల లే అవుట్ గంగపుత్ర నిర్మాణ సంస్థ ఏర్పాటు చేసిందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

ఈ సమావేశంలో నలుగురు కొత్త సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఎన్నికల అధికారిగా ఇమ్మడి పుల్లయ్య వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో డోలి రాజలింగం, దీటి మల్లయ్య, పారిపెల్లి రాజేందర్, ఎలుగు వెంకటేశ్వర్లు, వీరస్వామి, రాజేష్‌ఖన్నా, శ్రీనివాస్, బయ్య అనిల్, రామ్మూర్తి, జీ సుగుణ పాల్గొన్నారు.

నకిలీ కరెంటు సామగ్రి విక్రయం

రూ.28లక్షల నకిలీ వైర్లు, స్విచ్‌లు పట్టివేత

వరంగల్ క్రైం, సెప్టెంబరు 24: అక్రమ దందాలకు అడ్డాగా వరంగల్ నగరం మారుతోంది. గంజాయి, మట్కాలాంటి దందాలే కాకుండా కరెంటు పరికరాలు సైతం నకిలీవి విక్రయిస్తుండటం విశేషం. భవన నిర్మాణ రంగంలో వాడే ఎలక్ట్రికల్ వైర్లు, స్విచ్‌లను బ్రాండెడ్ కంపెనీల ముసుగులో నకిలీవి వరంగల్ నగరంలో విక్రయిస్తున్నారు. మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలో అండర్ బ్రిడ్జి, శివనగర్ ప్రాంతంలో శ్రీపార్వతీ ఎలక్ట్రికల్స్ యజమాని చౌదరి ధనరావు నకిలీ దందా చేస్తున్నట్లు సమాచారం రావడంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. రూ.28లక్షల 67వేల విలువైన వైర్లు, స్విచ్‌లను స్వాధీనం చేసుకున్నారు. విక్రయిస్తున్న ధనరావును అదుపులోకి తీసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు విచారణ నిమిత్తం మిల్స్‌కాలనీ పోలీసులకు అప్పగించారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ సీఐ రాజు ధ్రువీకరించారు.

కాళేశ్వరాలయ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

● అధికారులు మాస్టర్ ప్లాన్ రూపొందించాలి ● సౌకర్యాలు మెరుగుపర్చాలి ● రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్

మహదేవపూర్, సెప్టెంబరు 24: కాళేశ్వరాలయాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం సంకల్పించిందని, ఇందులో భాగంగా అధికారులు మాస్టర్ ప్లాన్‌ను రూపొంచాలని రాష్ట్ర దేవాదాలయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ ఆదేశించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కాళేశ్వర ముక్తీశ్వరాలయాన్ని ఆమె మంగళవారం సందర్శించారు. కాళేశ్వర ముక్తీశ్వరుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన ఆమెకు అర్చకులు ఆలయ సంప్రదాయ స్వాగతం, ఆశీర్వచనం పలికారు. అనంతరం ఆలయ కార్యనిర్వాహణాధికారి కార్యాలయంలో దేవాదాయ, పర్యాటకశాఖల అధికారులతో సమావేశమమైన శైలజా రామయ్యర్ దేవాలయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్, సరస్వతీ పుష్కరాల నిర్వహణ, పర్యాటకంగా కాళేశ్వరాన్ని అభివృద్ధి చేయడం తదితర అంశాలపై సమీక్షించారు. తెలంగాణలోని శైవక్షేత్రాల్లో కాళేశ్వరం దేవాలయం ప్రధానమని, రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయనుందని తెలిపారు. ఆలయ ప్రాంగణాన్ని విస్తరించడం, పలు పునర్నిర్మాణాలు, ఆధునికీకరణ, యాత్రికులకు సౌకర్యాల కల్పన, వసతి, భోజన శాల, పార్కింగ్ స్థలాలు, సురక్షిత తాగునీటి సౌకర్యం తదితర అంశాలపై అధికారులు ప్రణాళికలు రూపొందించాలన్నారు. దేవాలయ ప్రధాన ద్వారాన్ని శిల్పకలతో అలంకరించడం, గోదావరి ఘాట్ అభివృద్ధి, నది తీరాన్ని శుభ్రతతో, అందంగా అభివృద్ధి చేయడం, దేవాలయం చుట్టూ పర్యాటక మార్గాల అభివృద్ధి, స్థానిక సంస్కృతిక ప్రదర్శనలు, మ్యూజియం తదితర పనులు చేపట్టనున్నట్టు



కాళేశ్వరం ఆలయంలో ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యార్, కలెక్టర్ రాహుల్‌శర్మ

తెలిపారు. ఆలయ పరిసరాల్లో సీసీ కెమెరాలు బిగించాలని, పోలీసు, రెన్యూ, పంచాయతీరాజ్, దేవాదాయ, పర్యాటక శాఖ అధికారులతో టాస్క్ ఫోర్స్ టీం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దేవాలయ అభివృద్ధికి ప్రత్యేకంగా మంజూరైన నిధులతో చేపట్టిన పనులు పూర్తిచేయాలని కలెక్టర్ రాహుల్ శర్మను ఆదేశించారు. కాళేశ్వరం దేవాలయాన్ని అభివృద్ధి చేయడం ద్వారా భక్తులు పెద్ద ఎత్తున వస్తారని, తద్వారా పుణ్యక్షేత్రం ఎంతో అభివృద్ధి చెందుతుందని అన్నారు. అస్థికలు గోదావరిలో కలిపేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు దేవాలయ ఆధీనంలో ఉన్న రూములను ఎందుకు కేటాయించడం లేదని దేవస్థానం అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

సమాచార పౌర సంబంధాల శాఖ, దేవాదాయ శాఖ ప్రత్యేక కమిషనర్ హనుమంతరావు మాట్లాడుతూ.. భక్తులకు సౌకర్యాల కల్పనలో రాజీపడొద్దన్నారు. కాళేశ్వరం వచ్చే భక్తులు మహిళలు, పురుషులు బట్టలు మార్చుకునేందుకు గదులు ఏర్పాటు చేయాలన్నారు. నిర్మాణంలో ఉన్న 100 గదులను వెంటనే పూర్తి చేయాలన్నారు. మోడల్ మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టాలన్నారు. 2025లో జరిగే సరస్వతి పుష్కరాలనిర్వహణకు ఘాట్ సిద్ధం చేయాలని ఆదేశించారు. కలెక్టర్ రాహుల్‌శర్మ మాట్లాడుతూ రూ.19.39 కోట్ల ఎస్డీఎఫ్ నిధుల నుంచి రూ. 12.07 కోట్ల పనులు ఇప్పటికే పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన పనులు భూ సమస్య వల్ల ఆగిపోయాయని తెలిపారు. ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, పర్యాటక శాఖ జనరల్ మేనేజర్ ఉపేందర్‌రెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, దేవాదాయ శాఖ ఉప కమిషనర్ శ్రీనాథరావు తదితరులు పాల్గొన్నారు.

వరంగల్, హనుమకొండను ఒకే జిల్లాగా ప్రకటించాలి

జిల్లాల ఏకీకరణ ఉద్యమ కమిటీ చైర్మన్ వెంకటనారాయణ



హనుమకొండలోని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, పింగిళి సంపత్‌రెడ్డి

వడ్డెపల్లి, సెప్టెంబరు 24: వరంగల్, హనుమకొండ జిల్లాలను కలిపి ఒకే జిల్లాగా ప్రకటించాలని వరంగల్, హనుమకొండ జిల్లాల ఏకీకరణ ఉద్యమ కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, కమిటీ సభ్యుడు పింగిళి సంపత్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. భారతదేశ చరిత్రలో వరంగల్ నగరానికి, కాకతీయ సామ్రాజ్యంలో ఒక ప్రత్యేక స్థానం ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రం సాధిస్తే వరంగల్ నగరం హైదరాబాద్‌కు సమాంతరంగా ఒక ఆర్థిక, వాణిజ్య, విద్య, వైద్య, ఉపాధి ఉద్యోగాలు కల్పించే కేంద్రంగా మారుతుందని ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు ఆశించారని పేర్కొన్నారు. ఏ రాష్ట్రంలో ఏ ఉమ్మడి జిల్లాను రెండు నుంచి నాలుగు జిల్లాల కంటే ఎక్కువ విభజించలేదని తెలిపారు. వరంగల్ ఉమ్మడి జిల్లాను ఆరు జిల్లాలుగా చేసి ఇక్కడి రాజకీయ చైతన్యం, అభివృద్ధి, భౌగోళిక ఉనికి, నగర స్వరూపాన్ని విధ్వంసం చేశారని ఆరోపించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం వరంగల్, హనుమకొండ జిల్లాలను ఒకే జిల్లాగా చేసి అభివృద్ధికి బాటలు వేయాలని కోరారు. సమావేశంలో జిల్లాల ఏకీకరణ ఉద్యమ కమిటీ సభ్యులు సోమ రామ్మూర్తి, దారం జనార్దన్, కోండ్ర నర్సింగరావు, సోమిడి శ్రీనివాస్, డాక్టర్ మంద వీరస్వామి, ఐతం నాగేష్, చిల్ల రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కేయూ ఫార్మసీ కళాశాలలపై కొరడా

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 24: కేయూ పరిధిలోని 10 ఫార్మాడీ కళాశాలు, అలాగే మరో 4 బీఫార్మసీ సీట్లలో కోత విధించి వర్సిటీ ఉన్నతాధికారులు కొరడా ఝుళిపించారు. 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం 'అనుమతుల కోసం అడ్డదారులు' అనే శీర్షికతో వచ్చిన కథన కలకలం రేపింది. వర్సిటీ సీడీసీ డీన్ అధికారులు, ఫార్మసీ తనిఖీ అధికారుల నుంచి ప్రత్యేక నివేదికను తెప్పించుకుని సరైన వసతులు లేని కళాశాలలపై చర్యలకు దిగారు. వరంగల్ - హనుమకొండ, ఖమ్మంలోని 10 ఫార్మాడీ, మరో 4 బీఫార్మసీ కళాశాలల్లో గతంలో ఉన్న సీట్లలోనూ కోత విధించింది. ఈ మేరకు వర్సిటీ అధికారులు ఉత్తర్వులు వెలువరించారు.

బీఫార్మసీలో సీట్ల కోత విధించిన కళాశాలివే.. : కాకతీయ యూనివర్సిటీలో పరిధిలో 4 బీఫార్మసీ కళాశాలల్లో గతంలో ఉన్న 100 సీట్లకు బదులుగా ఈ ఏడాది 60 సీట్లకు తగ్గించారు. కోత పడిన కళాశాలల్లో ఖమ్మంలోని మహ్మదీయ కాలేజీ ఆఫ్ ఫార్మసీ, సహస్ర ఫార్మసీ కళాశాల హనుమకొండ, శ్రీ కాలేజీ ఆఫ్ ఫార్మసీ కొత్తగూడెం, శ్రీ కాకతీయ కాలేజీ ఆఫ్ ఫార్మసీ, హనుమకొండలున్నాయి.

పార్మాడీ కళాశాలివే.. : కేయూ పరిధిలో 1 ఫార్మాడీ కళాశాలలపై సీట్లపై వేటు పడింది. వాటిలో నర్సంపేటలోని బాలాజీ పార్మాడీ కాలేజీ, జయముఖి కాలేజీ, సోమిడి నేతాజీ పార్మాడీ కాలేజీ, హనుమకొండ సహస్ర పార్మాడీ కాలేజీ, ఖమ్మంలోని బ్రౌన్స్ ఫార్మాడీ కాలేజీ, మహ్మదీయ ఫార్మాడీ కాలేజీ, ఖమ్మం కాలేజీ ఫార్మాడీ, హనుమకొండ పాత్‌ఫైండర్, శ్రీ శివానీ పార్మాడీ కాలేజీ, ఎస్ఆర్ఆర్ పార్మాడీ కాలేజీలున్నాయి. ఆయా కళాశాలల్లో గతంలో ఉన్న 30సీట్లకు బదులుగా 20 సీట్లకు తగ్గించారు.

రేపు వాహనాలకు వేలం

గూడూరు, సెప్టెంబరు 24 : గూడూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌లో వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలకు ఈనెల 26న వేలం పాట నిర్వహించనున్నట్లు సీఐ బిక్షపతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఎక్సైజ్ అధికారి కిరణ్ సమక్షంలో వాహనాలకు వేలం నిర్వహించనున్నట్లు చెప్పారు. 26 ద్విచక్రవాహనాలు, ఒక అశోక లేలాండ్ మినీ గూడ్స్ ఉన్నట్లు చెప్పారు. ఈ వేలంలో పాల్గొనదలిచిన వారు ద్విచక్రవాహనాలకు రూ.20 వేలు, అశోక్ లేలాండ్ గూడ్స్‌కు రూ.50 వేలను ఈఎండీగా చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని చెప్పారు.

దళిత బంధుపై డబ్బులు తీసుకున్నారని ఫ్లెక్సీ

కేసముద్రం,సెప్టెంబర్ 24 : తనకు దళితబంధు ఇస్తానని చెప్పి మోసం చేశారని ఆరోపిస్తూ పెద్దమోరీతండాలో అండె అనిల్ పేరిట ఫ్లెక్సీని మంగళవారం ఏర్పాటు చేశారు. దళితబంధు ఇప్పిస్తానని చెప్పడంతో తన గొర్రెలనువిక్రయించి రూ.70 వేలు గ్రామంలోని ఓ బీఆర్ఎస్ నాయకుడికి గత ఏడాదిజూన్‌లో ఇచ్చినట్లు ఫ్లెక్సీలో ఆరోపించాడు. తాను ఇచ్చిన తిరిగి డబ్బులు ఇవ్వాలని.. లేదా గొర్రెలనైనా ఇప్పించాలని, లేదంటే ఆత్మహత్యే శరణ్యమని పేర్కొన్నాడు. ఈ ఫ్లెక్సీ స్థానిక సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.



పెద్దమోరీతండాలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

ఐటీఐలో ప్రవేశాలకు గడువు పొడిగింపు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 24 : జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి అర్హులైన విద్యార్థులు దరఖాస్తులు చేసుకునేందుకు ఈనెల 28 వరకు పొడగించినట్లు ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతిరెడ్డి మంగళవారం తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు మెరిట్ ప్రాతిపాదికన మాత్రమే సీట్ల కేటాయింపు ఉంటుందన్నారు. దరఖాస్తు చేసుకున్న వారు ఈనెల 25 నుంచి 28 వరకు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సంబంధిత సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు.

ఎఫ్ఏసీ ఎంఈవో అధికారుల నియామకం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 24 : జిల్లాలోని 18 మండలాలకు మండల విద్యాశాఖ అధికారులను నియమిస్తూ మంగళవారం రాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.ఆయా మండలాల పరిధిలో గెజిటెడ్ సీనియర్ ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న ప్రధానోపాధ్యాయులను ఎఫ్ఏసీ ఎంఈవోలుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కొత్తగూడ ఎఫ్ఏసీ ఎంఈవోగా జి.లక్ష్మీనారాయణ, చిన్నగూడురు ఎస్.రవికుమార్, దంతాలపల్లి ఎం.శ్రీదేవి, గంగారం పి.వీరస్వామి, డోర్నకల్ లాక్యా, గార్ల ఎం.వీరభద్రారావు, కురవి వి.బాలోజీ, మహబూబాబాద్ ఎస్.వెంకటేశ్వరరావు, మరిపెడ జి.అనితాదేవి, సీరోలు ఈ.లచ్చిరాం, నర్సింహులపేట బి.రామ్మోహన్‌రావు, పెద్దవంగర బి.శ్రీనివాస్, తొర్రూరు ఎం.బుచ్చయ్య, గూడూరు జె.రవికుమార్, కేసముద్రం కె.యాదగిరి, ఇనుగుర్తి జె. రూపరాణి, నెల్లికుదురు రాందాస్, బయ్యారం దేవేంద్రాచారిలను నియమించారు.

సీపీఐ నేత విజయసారథికి పరామర్శ

మహబూబాబాద్ టౌన్ : పట్టణంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథిని మంగళవారం ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పరామర్శించారు. ఇటీవల బి.విజయసారథి మామ కాసర్ల సోమిరెడ్డి మృతి చెందిన విషయం విధితమే. ఈవిషయం తెలుసుకున్న కూనంనేని మానుకోటకు చేరుకుని సోమిరెడ్డి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి, సోమిరెడ్డి కుమార్తెలు సరిత, విద్య, బంధువులు నారాయణరెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

'దేశంలో ఫాసిస్టు విధానాల అమలు'

బయ్యారం, సెప్టెంబరు 24 : దేశంలో బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు విధానాలు అమలవుతున్నాయని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి సాధినేని వెంకటేశ్వరరావు ఆరోపించారు. ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎస్కే ముక్తార్ పాష 4వ వర్ధంతి బయ్యారంలో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా సాధినేని మాట్లాడుతూ పాషా మరణం విప్లవోద్యమాలకు తీరని లోటన్నారు. అనంతరం నాయకులు గోవర్ధన్, ఐలయ్య, సత్యనారాయణ, సీతారామయ్య, దేవేందర్, శ్రీధర్, పద్మ, శ్రీశైలం ప్రసంగించారు. అంతకుముందు గ్రామంలో ఊరేగుతూ డప్పు నృత్యాలు ప్రదర్శించి కొత్తపేట గ్రామంలో ఇల్లెందు-మహబూబాబాద్ ప్రధాన రహదారి పక్కన మాధురి టైల్స్ సమీపంలో పాషా స్మారక స్థూపానికి నాయకులు శంకుస్థాపన చేశారు. మధు, వీరభద్రం, వెంకటయ్య, నర్సక్క, రాకేశ్, బిక్షం, రమేష్, నరసింహా, నాగేశ్వరరావు, నాగరాజు, భద్రయ్య, రాజమల్లు, మల్లయ్య, సమ్మక్క, శారధమ్మ పాల్గొన్నారు.

పంటనష్టపోయిన రైతులకు సాయమందించాలి

- చెరువు కట్టలు, రోడ్లు, బ్రిడ్జిలకు మరమ్మతులేవి?
- ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్

మహబూబాబాద్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు ఇప్పటి వరకు సాయం అందలేదని, వెంటనే అందించాలని మాజీమంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ అన్నారు. వర్షాలతో నష్టపోయిన వారిని ఆదుకోవాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌కు మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అకాల వర్షాలతో ప్రజలు సర్వం కోల్పోయి నిరాశ్రయులయ్యారని, వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రభుత్వ సాయం కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని చెప్పారు. క్షేత్రస్థాయిలో సాయం అందక వందలాది మంది బాధితులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టు తిరుగుతూ కన్నీరు మున్నీరవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాడి పంటలు, ఉపాధి కోల్పోయి కన్నీరు పెడుతున్నారని, ఎలాంటి ఆంక్షలు లేకుండానష్టపోయిన ప్రతీ కుటుంబానికి పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నామమాత్రంగా సాయం చేసి చేతులు దులుపుకుందామనుకుంటున్న పాలకుల తీరుతో ప్రజలు నష్టపోతున్నారని చెప్పారు. చెరవుల కట్టలు తెగిపోయి, రోడ్లు, బ్రిడ్జిలు దెబ్బతిని రవాణా సౌకర్యానికి ప్రజలు ఇబ్బందులుపడుతున్నారని తక్షణమే మరమ్మతులు చేయించాలని కోరారు. ఇప్పటికైనా యుద్ధ ప్రాతిపదికన చెరువు కట్ట మరమ్మతులు మొదలు పెట్టి యాసంగి పంటకు నీరందే విధంగా చూడాలన్నారు. గత ప్రభుత్వంలో పూర్తైన అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులు సకాలంలో చెల్లించాలని డిమాండ్ చేశారు.


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్

భీమునిపాదంలో 'జ్ఞానిదార్' సందడి

గూడూరు, సెప్టెంబరు 24 : మండలంలోని సీతానగరం శివారు కొమ్ములవంచ సమీపంలో ఉన్న భీమునిపాదం జలపాతం వద్ద మంగళవారం జ్ఞానిదార్ సినిమా షూటింగ్ నిర్వహించారు. ఈ సినిమాలో ప్రత్యేక పాత్రలో గూడూరు మండలానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, ఎన్‌టీవీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బానోత్ రామన్న నాయక్, మాజీ ఎంపీపీ చెల్పూరి వెంకన్న, సీతానగరం మాజీ ఎంపీటీసీ రమామన్మోహన్‌రెడ్డి ప్రత్యేక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సందర్భంగా సినిమా నిర్మాత అంగోతు రాం బాబు మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతీసంప్రదాయలు అద్దం పట్టేలా, బంజార జాతి సంస్కృతిని, సాంప్రదాయాలను పెంపొందించేలా.. నేటి సమాజం గర్వించదగ్గ సినిమాను నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నటీనటులు కేశునందన్, రాంబాబునాయక్, జైసింగ్‌రాథోడ్, కృష్ణవేణి, కవిత, మధు, కోటి, శంకర్‌నాయక్, ధనలక్ష్మి, సోమన్లాల్‌రాథోడ్, విజయ్‌రాజ్, రాంబాబు, భూక్య మంగీలాల్, మైదం రాజు, ఎండి.రహీం, భాస్కర్‌నాయక్ పాల్గొన్నారు.


భీమునిపాదంలో జ్ఞానిదార్ సినిమాలోని సన్నివేశాన్ని చిత్రీకరిస్తున్న దృశ్యం


ఏపీ సీఎం చంద్రబాబుకు లేఖను పోస్టుద్వారా పంపిస్తున్న శంతన్ రామరాజు

తిరుపతి లడ్డూ అపవిత్రతపై విచారణ చేపట్టాలి

- జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శంతన్ రామరాజు

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 24 : తిరుపతి లడ్డు అపవిత్రతపై సీబీఐతో విచారణ చేయించి, అం దుకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శంతన్ రామరాజు విజ్ఞప్తి చేశారు. తిరుపతి లడ్డు ప్రసాదంపై సీబీఐచే విచారణ జరిపించాలని కోరుతూ ఏపీ సీఎం చంద్రబాబుకు రాసిన లేఖను మంగళవారం పోస్టు ద్వారా పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి శ్రీవేంకటేశ్వరస్వామి లడ్డు ప్రసాదం కల్తీతో ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయని, ఇది ముమ్మాటికి సనాతన ధర్మంపై దాడియేనని చెప్పారు. గత ఐదేళ్లలో కొండపై జరిగిన అవినీతిపై విచారణ చేసేందుకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని కోరారు. కాసులకు కక్కుర్తిపడి లడ్డును అపవిత్రం చేసిన దోషులను శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో నల్ల అవేత్‌కుమార్, కొండి సాయికిరణ్ పాల్గొన్నారు.

'ప్రజాసమస్యలపై పోరాటం చేస్తాం'

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 24 : కమ్యూనిస్టులకు అధికారం ఉన్నా.. లేకపోయినా.. నిత్యం ప్రజాసమస్యలపై పోరాడుతారని సీపీఎం పట్టణ కార్యదర్శి సీతారాంనాయక్ అన్నారు. మహబూబాబాద్ పాత కలెక్టరేట్ ఏరియా కాలనీ సీపీఎం శాఖ మహాసభను మంగళవారం భూక్య రాజేష్ అధ్యక్షతన నిర్వహించారు. కుమ్మరికుంట్ల నాగన్న, బానోత్ వెంకన్న, ఎర్ర శ్రీనివాస్, నాగేష్, రవి, యాకాంబ్రం, సత్యనారాయణ పాల్గొన్నారు.

సైడ్ డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 24 : ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని స్థానిక వార్డు కౌన్సిలర్, మునిసిపల్ వైస్ చైర్మన్ ఎమ్డీ. ఫరీద్ అన్నారు. మహబూబాబాద్ మునిసిపల్ 27వ వార్డు పరిధిలోని బెస్తబజారులో జనరల్ ఫండ్ రూ.2లక్షలతో నిర్మిస్తున్న సైడ్‌డ్రైనేజీ నిర్మాణ పనులకు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో దుగ్గి గోపాల్, డోలి శ్రీనివాస్, దుగ్గి రాంగోపాల్, రమేష్, సట్ల రాజు, కార్తీక్, నిమ్మల వేణు పాల్గొన్నారు.

పేదల ఇళ్లను కూల్చొద్దు : సీపీఐ

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 24 : రెండు దశాబ్దాల నుంచి నివాసముంటున్న పేదల ఇళ్లను కూల్చవద్దని సీపీఐ మునిసిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయసారథిరెడ్డి కోరారు. స్థానిక తహసీల్ కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో గత 20 ఏళ్ల క్రితం తలారి వెంకటేశ్వర్లు కాలనీ ఏర్పడిందని, అందులో నిరుపేద మహిళా మద్దినేని నర్సమ్మ ఇల్లు ఇటీవల కురిసిన వర్షాలకు కూలిపోవడంతో తిరిగి నిర్మించుకుంటున్న క్రమంలో రెవెన్యూ, మునిసిపాలిటీ అధికారులు అన్యాయం కూల్చివేశారని చెప్పారు. అనంతరం తహసీల్దార్ భగవాన్‌రెడ్డికి వినతి పత్రాన్ని అందించారు. సీపీఐ నాయకులు పెరుగుకుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి, వెలుగు శ్రావణ్, ఫాతిమా, మహిమూద్, కేదాసు రమేష్, అశోక్, చిరంజీవి, భాగ్యమ్మ, శంకర్, పాల్, నాగార్జున, శ్రీనాథ్, లక్ష్మణ్, పామర్, నరేష్ పాల్గొన్నారు.



తహసీల్ ఆఫీసు ఎదుట ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

'దేశాన్ని కాపాడుకుందాం'

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబరు 24 : మతోన్మాద ఫాసిస్టు శక్తుల నుంచి దేశాన్ని కాపాడుకుందామని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు మండల వెంకన్న అన్నారు. జ్యోతిబాపూలే స్థాపించిన సత్యశోదక్ 152వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని జ్యోతిబాపూలే విగ్రహానికి మంగళవారం పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. హలావత్ లింగన్న, సామ పాపయ్య, లక్ష్మయ్య, పర్వత కోటేష్, జబ్బార్, కృష్ణ, కుక్కముడి యాకయ్య, మురళి, కవిత, కల్యాణి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కార్మిక సంక్షేమ బోర్డును ఇతర సంస్థలకు అప్పగించవద్దు

కేసముద్రం, సెప్టెంబరు 24 : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన బోర్డును ఇతర సంస్థలకు అప్పగించవద్దని డిమాండ్ చేస్తూ ఏఐసీటీయూ ఆధ్వర్యంలో కేసముద్రం మార్కెట్ గేట్ ఎదుట మంగళవారం కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు కంచ వెంకన్న మాట్లాడుతూ ఈ బోర్డును ఇతరులకు అప్పగిస్తే కార్మికుల సంక్షేమ ప్రయోజనాలు దెబ్బతింటాయని అన్నారు. కార్యక్రమంలో ధారావత్ రమేష్, గోపన్న, రవి, శంకర్‌నాయక్, ఉపెందర్, రవి, వెంకటయ్య, సాంబయ్య, రవీంద్రబాబు పాల్గొన్నారు.

సామూహిక శ్రీమంతాలు, అన్నప్రాసన

బయ్యారం, సెప్టెంబరు 24 : పోషణ మాసాన్ని పురస్కరించుకొని ఇంటింటా పోషణ సంబురాలు కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉప్పలపాడు సెక్టార్ పరిధిలో గల వెంకట్రాంపురం గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక శ్రీమంతాలు, అన్నప్రసన్న కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సర్వార్‌బి, బయ్యారం పీహెచ్‌సీ వైద్యాధికారి సాగర్, స్పెషల్ ఆఫీసర్ లింగరాజు, విజయ, సరోజ, కళావతి, సావిత్ర, వినోద, సమ్మక్క, ఆరుణ, మంజుల పాల్గొన్నారు.


వెంకట్రాంపురంలో సామూహిక అన్నప్రసన్న కార్యక్రమం అంగన్‌వాడీలు

వారంలో మహిళ శక్తి క్యాంటీన్ ఏర్పాటు

డోర్నకల్, సెప్టెంబరు 24 : డోర్నకల్ మునిసిపల్ కేంద్రంలో వారం రోజుల్లోగా మహిళ శక్తి క్యాంటిన్ ప్రారంభించనున్నట్లు డీఆర్‌డీవో పీడీ మధుసూదన్ రాజు అన్నారు. మంగళవారం డోర్నకల్‌లో సదరు క్యాటిన్ ఏర్పాటు స్థలాన్ని పీడీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డోర్నకల్ మెయిన్ రోడ్డులో క్యాంటిన్ ఏర్పాటు పనులు జరుగుతున్నాయని, త్వరలోనే క్యాంటిన్‌ను ప్రారంభిస్తామని చెప్పారు. డోర్నకల్ సెర్ప్ ఏపీఎం శంకర్ నాయక్, ప్రగతి మండల సమాఖ్య అధ్యక్షురాలు నాగలక్ష్మి, సీసీలు స్వర్ణలత, రాధ, కవిత, నళిని, మంజుల పాల్గొన్నారు.

పట్టుకున్న పీడీఎస్ రైస్ ఏమైనట్టు?

గంగారం, సెప్టెంబరు 24 : సోమవారం రాత్రి మడగూడెంలో అక్రమంగా తరలిపోతున్న పది క్వింటాళ్ల పీడీఎస్ రైస్‌ను వాహనంతో సహ గ్రామస్థులు పట్టుకున్నారు. ఈబియ్యంను పోలీసులు రాత్రే స్వాధీనం చేసుకోవాల్సి ఉంది. అయితే పట్టుకున్న బియ్యంను ఆటోతో సహ పోలీస్‌స్టేషన్‌కు అప్పగించాలని స్థానిక ఎస్ఐ రవికుమార్ ఆదేశించారు. బియ్యం ఆటోతో సహ స్టేషన్‌కు రాలేదు. బియ్యం పట్టుకున్నట్లు సామాజిక మాధ్యమాలలో ప్రచారం జరిగినా పోలీసులు స్పందించకపోవటం పలు అనుమానాలకు తావిస్తోంది. గంగారానికి చెందిన ఓమాజీ సర్పంచ్ తనయుడు అదే గ్రామానికి చెందిన ఆటోలో పీడీఎస్ రైస్‌ను తక్కువ రేటుకు కొనుగోలు చేసి రైస్ మిల్లర్లకు విక్రయిస్తున్నారని సమాచారం. కాగా, పట్టుకున్న బియ్యం ఏమైనట్టు అంటూ గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు.

ఈ విషయంపై ఎస్ఐ రవి కుమార్‌ని వివరణ కోరగా మడగూడెంలో ఆటోలో బియ్యం పట్టుకున్న మాట వాస్తవమేనన్నారు. కానీ, వారోత్సవాల సందర్భంగా తమకు ఆ గ్రామానికి అర్ధరాత్రి వెళ్లటానికి అనుమతి రాలేదు. ఆటోను బియ్యంను తీసుకు రమ్మని ఆదేశిస్తేడ్రైవర్ గ్రామంలోనే వదిలిపారిపోయినట్టు తెలిసిందాన్నారు.


మడగూడెంలో గ్రామస్థులు ఆటోతో సహ పట్టుకున్న పీడీఎస్ బియ్యం

కమ్యూనిస్టులే ప్రజలకు అండ

సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్


మరిపెడ రూరల్, సెప్టెంబరు 24 : కమ్యూనిస్టులే దేశ ప్రజలకు అండ అని సీపీఎం జిల్లా కార్యదర్శి సాధుల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం గుండెపుడిలో సీపీఎం మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు అలువాల వీరయ్య, దుండి వీరన్న, బాణాల రాజన్న, గుండగాని మధుసూదన్, షరీఫ్, శ్రీనివాసరెడ్డి, రాజశేఖర్, మౌలానా, అనంతాచారి పాల్గొన్నారు.

దాడి కేసులో ఐదుగురికి జైలు

మరిపెడ, సెప్టెంబరు 24 : వ్యక్తిపై దాడిచేసి తీవ్రంగా గాయపర్చిన కేసులో ఐదుగురికి తొర్రూరు సివిల్ కోర్టు జడ్జి మట్ట సరిత జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.10వేల జరిమానా విధించారు. ఎస్సై సతీశ్ తెలిపిన వివరాల ప్రకారం. బీచ్‌రాజ్‌పల్లి శివారు జర్పులతండాకు చెందిన జర్పుల వెంకన్న అదే తండాకు చెందిన రాందాస్ భూమిని కౌలు చేస్తున్నారు. ఈ క్రమంలో వెంకన్నపై కక్షపెంచుకున్న జర్పుల ప్రేమ్‌చంద్, జర్పుల రామారావు, జర్పుల లింగ్యా, శివ, జర్పుల రమేశ్ 2015లో జర్పుల వెంకన్న మరిపెడ శివారు నేతవత్‌తండాలోని బంధువుల వివాహ కార్యక్రమానికి వెళ్లగా ఆయనపై రాళ్లతో దాడిచేసి కొట్టారు. అప్పటి ఎస్సై వై.కృష్ణకుమార్ కేసు నమోదు చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ కేసును పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ ఆనంద్, రేవతి వాదించగాజడ్జి వాదోపవాదాలు పరిశీలించి నిందితులకు రెండేళ్లజైలు, రూ.10 వేల చొప్పున జరిమానా విధించారు. సాక్షులను కోర్టు పీసీ రాంనారాయణ ప్రవేశపెట్టగా ఆయనను డీఎస్పీ సురేశ్, సీఐ రాజ్‌కుమార్ గౌడ్, ఎస్సై సతీశ్, సంతోశ్ అభినందించారు.

చేపల వ్యాన్‌బోల్తా

ఒకరికి గాయాలు, చేపలు లూటీ చేసిన జనం


బోల్తాపడిన వ్యాన్, చేపలు ఎత్తుకెళుతున్న స్థానికులు

మరిపెడ, సెప్టెంబరు 24 : విజయవాడ వైపు నుంచి వరంగల్ వైపు వెళ్తున్న చేపల వ్యాన్ మంగళవారం తెల్లవారుజామున మరిపెడ బస్టాండ్ సమీపంలోని జాతీయ రహదారిపై బోల్తాపడింది. వీరారం గ్రామానికి చెందిన జిన్న ఐలయ్యకు గాయాలు అయ్యాయి. రోడ్డుపై పడిన చేపలను స్థానికులు లూటీ చేశారు. డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. మరిపెడ బస్టాండ్ దగ్గర్లో వీరారం వాసి జిన్న ఐలయ్య సడన్‌గా అడ్డు రావడంతో చేపలలోడ్‌తో వెళ్తున్న ఆవ్యాన్ డ్రైవర్ సడన్ బ్రేక్ వేయగా ఆ వ్యాన్ రోడ్డుపై బోల్తాపడింది. దాంట్లోని చేపలు రోడ్డుపైపరుగులు పెడుతుండగా చూసిన జనం వాటిని బస్తాలు, సంచుల్లో తీసుకెళ్లారు. ఈ విషయంపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై బోలగాని సతీశ్‌గౌడ్ తెలిపారు.


రామన్నగూడెంలో సామూహికంగా చెట్ల కింద వంట చేస్తున్న గ్రామస్థులు

ఊరికి కీడొచ్చిందని.. వనభోజనాలకు

నర్సింహులపేట, సెప్టెంబరు 24 : కీడు తొలగిపోవాలి తల్లీ.. ఊరికి కీడొచ్చిందని సామూహిక వన భోజనాలకు వెళ్లిన ఘటన నర్సింహులపేట మండలంలో జరిగింది. రామన్నగూడెంలో జులై 4న ముగ్గురు యువకులు అస్వస్థతకు గురి కాగా, వారిలో ఇద్దరు యువకులు మృతి చెందారు. అప్పటి నుంచి గ్రామంలో వరుసగా అస్వస్థతకు గురికావడం తరుచూ జరుగుతున్నట్లు తెలిపారు. చిన్నా, పెద్ద తేడాలేకుండా 15 రోజుల నుంచి జ్వరాల బారిన పడుతుండడంతో గ్రామానికి చెందిన కొందరు కుల పెద్దలు పురోహితులను సంప్రదించారు. పురోహితుల సూచన మేరకు మంగళవారం తెల్లవారు జామున్నే గ్రామస్థులందరూ సామాహికంగా ఊరి చివరన వనంలోకి వన భోజనాలకు వెళ్లారు. శాస్త్ర సాంకేతికంగా అభివృద్ధి చెందుతున్న ఈ రోజుల్లో గ్రామీణ ప్రజలు మూఢనమ్మకాలను నమ్ముతుండం విశేషం. గ్రామంలో ఇంత జరుగుతున్నా వైద్య సిబ్బంది గ్రామం వైపు చూడకపోవడం వైద్యుల పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జీవో 25ను సవరించాలి

నర్సింహులపేట, సెప్టెంబరు 24 : ప్రభుత్వ అసంబద్ధ రేషనలైజేషన్ జీవో-25ను సవరించాలని డిమాండ్ చేస్తూ నర్సింహులపేట కాంప్లెక్స్ ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో మంగళవారం భోజన విరామం సమయంలో ప్రభుత్వానికి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు వై.క్రాంతికుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే జీవో- 25ను సవరించాలని డిమాండ్ చేశారు. ఈ జీవోతో సర్కారు బడుల మనుగడ ప్రశ్నార్థకంగా మారి, విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తీరుమారకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, రామ్మోహన్‌రావు, శేఖర్, వేణుగోపాల్, నర్సింహారావు, మంగిలాల్, రాగిణి, పద్మావతి పాల్గొన్నారు.

మరిపెడలో..

మరిపెడ, సెప్టెంబరు 24 : విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయుల నియామకం ఉండాలని ఇటీవల ప్రభుత్వం జారీ చేసిన జీవోను 25ను వెంటనే సవరించాలని ఐక్య ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం లంచ్ బ్రేక్‌లో మరిపెడ టీచర్లు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీచర్లు రమేశ్‌రెడ్డి, హేమ్లా, మహేశ్, జనార్దనాచారి, మంగు, అఫీజ్, కరుణాకర్, వెంకన్న, మంగీలాల్, ఉపాధ్యాయినులు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో దొడ్డుబియ్యం?

తొర్రూరు రూరల్, సెప్టెంబరు 24 : తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో అందించే మధ్యాహ్నం భోజనంలో దొడ్డు బియ్యం అందిస్తున్నట్లు సమాచారం. చెర్లపాలెం ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు అందించే మధ్యాహ్నం భోజనం బియ్యం దొడ్డుగా ఉన్నాయని తల్లిదండ్రులు వెల్లడించారు. ఈ విషయంపై పాఠశాల హెచ్ఎం బుచ్చయ్యను వివరణ కోరగా.. ప్రభుత్వం సరఫరా చేసే గోడౌన్ నుంచి వస్తున్నాయి. కొన్నిసార్లు బియ్యం కొంత దొడ్డుగా వస్తుంటాయి. కానీ, ఎలాంటి ఇబ్బందికరంగా ఉండటంలేదని వెల్లడించారు. రోజు విద్యార్థులతో పాటు తాను తింటున్నానన్నారు.

ఆర్టీసీ బస్సు - ట్రాలీ ఢీ

తొర్రూరు రూరల్, సెప్టెంబరు 24 : మండలంలోని నాంచారిమడూరు గ్రామంలో ఆర్టీసీ బస్సు- ట్రాలీ ఆటో ఢీ కొట్టిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం. ఐలోని మండలానికి చెందిన సంతోష్, పూర్ణచందర్ తొర్రూరులో మంగళవారం సంత కావడంతో గొర్రెలను కొనుగోలు చేసుకొని వెళ్తున్నారు. ఈ క్రమంలో వరంగల్ నుంచి తొర్రూరుకు వస్తున్న ఆర్టీసీ బస్సు, తొర్రూరు నుంచి వరంగల్ వైపు వెళ్తున్న ట్రాలీ ఢీ కొట్టడంతో ట్రాలీ డ్రైవర్ పూర్ణచందర్ కాలుకు గాయాలు అయ్యాయి. స్థానికులు 108 వాహనంలో తొర్రూరు ఆస్పత్రికి తరలించారు.

మాజీ సర్పంచ్‌కు జైలు శిక్ష

తొర్రూరు, సెప్టెంబరు 24 : తొర్రూరు గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడు సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టిన దరావత్ రాజేష్ నాయక్‌కు తొర్రూరు కోర్టు జూనియర్ సివిల్ జడ్జి మట్ట సరిత జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారని ఎస్సై ఉపేందర్ తెలిపారు. మంగళవారం కోర్టు ఆవరణలో శిక్ష పడిందన్నారు. 2013 సంవత్సరంలో గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా ఉన్న రాజేష్ నాయక్ అర్ధరాత్రి పంచాయతీ కార్యాలయంలో అసాంఘిక కార్యకలాపానికి పాల్పడగా అప్పుడు ఎస్సైగా ఉన్న రాయల వెంకటేశ్వర్లు పట్టుకుని కేసు నమోదు చేయగా, అప్పటి సీఐ రాజు విచారణ చేపట్టి చార్జ్‌షీట్ ఫైల్ చేశారు. సాక్షాదారులను కోర్టులో ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ డి.గణేష్ ఆనందర్, రేవతిదేవి కేసును వాదించగా పూర్వాపరాలను పరిశీలించిన తొర్రూరు జూనియర్ సివిల్ జడ్జి మట్ట సరిత రాజేష్ నాయక్‌కు 3సంవత్సరాల జైలు శిక్ష, రూ.4వేల జరిమానా విధించినట్లు తెలిపారు.

క్రీడల్లో రాణించడం అభినందనీయం

తొర్రూరు, సెప్టెంబరు 24 : విద్యార్థులు క్రీడల్లో రాణించడం అభినందనీయమని అభ్యాస్ స్కూల్ కరస్పాండెంట్ కె.నరేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం పాఠశాల ఆవరణలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో స్కూల్ విద్యార్థులు రిత్విర్, పార్థివ్, షన్ముక్‌కు రాష్ట్రస్థాయిలో గోల్డ్ మెడల్ రావడంతో వారిని అభినందించి మాట్లాడారు. విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ప్రిన్సిపాల్ సుమలత, ఉపాధ్యాయులు ఎనమల రాకేష్, పండరీనాథ్, రజిత, మౌనిక, చంటి, శ్రీనివాస్ ఉన్నారు.

కొనసాగిన సామాజిక తనిఖీ

పెద్దవంగర, సెప్టెంబరు 24 : మండలంలో ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ బృందం నిర్వహించిన మూడో విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక మంగళవారం వరకు నామమాత్రంగా కొనసాగింది. ఈ సందర్భంగా ఈజీఎస్ ఆడిషనల్ ఏపీడీ శాంతకుమారి మాట్లాడుతూ 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు మండలంలో 20 గ్రామ పంచాయతీలు ఉండగా ఉపాధిహామీ ద్వారా రూ.9కోట్ల సంబంధించి వివిధ పనులను చేపట్టినట్లు తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల్లో నిర్వహించిన పనులకు సంబంధించి పది రోజులు సామాజిక తనిఖీ నిర్వహించినట్లు పేర్కొన్నారు. పలు పనుల్లో రూ.7.15లక్షలు అవకతవకలు జరిగినట్లు తేలిందని, వారినుంచి రికవరీ చేస్తామని, అవకతవకలు జరగలేదని నిరూపించుకుంటే మినహాయింపు ఇస్తామని తెలిపారు. ఎంపీడీవో వేణుమాధవ్, ఏపీవో బిందు, ఆదామ్, ఎస్ఆర్‌పీ కుమార్, రమేష్, ఆయాగ్రామాల పంచాతీకార్యదర్శులు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

తొర్రూరు, సెప్టెంబరు 24 : ప్రజా సమస్యల పరిష్కారానికి అహర్నిషలు కృషి చేస్తానని పట్టణ కార్యదర్శి కొమ్మనబోయిన యాకయ్య అన్నారు. రెండు రోజుల క్రితం పార్టీ నిర్వహించిన మహాసభలో యాకయ్యను సీపీఎం పట్టణ కార్యదర్శిగా ఎంపిక చేసినట్లు జిల్లా కమిటీ సభ్యులు బొల్లం అశోక్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా యాకయ్య పట్టణంలోని ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈకార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి ఎం.డీ యాకూబ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'సంఘ్ పరివార్ శక్తుల కుట్రలను తిప్పికొట్టాలి'



మాట్లాడుతున్న రవి

తొర్రూరు, సెప్టెంబరు 24 : దేశంలో సాగుతున్న పరిపాలన దారితప్పి నిరంకుశ విదానం వైపు ప్రయాణం వల్ల దేశం ప్రమాదంలో పడబోతుందని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లాసహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి, మాజీ జడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నుంచు సంతోష్, సీపీఐ జిల్లా నాయకుడు భిక్షపతి అన్నారు. మంగళవారం తొర్రూరులోని విశ్రాంతి భవనంలో 'కులనిర్మూలన, ఆచరణాత్మ' అనే అంశంపై వారు మాట్లాడుతూ నేటి నుంచి ఈనెల 30 వరకు నిర్వహించే కుల నిర్మూలన అంశాలను ప్రజల్లో చైతన్య పర్చడానికి, వారికి తెలియజేసేందుకే ఈ సమావేశం నిర్వహించామన్నారు. నాయకులు వీరన్న, రాములు, పాపారావు, యాకయ్య, నరేందర్, అశోక్‌రెడ్డి, వెంకన్న, ఎల్లయ్య, కొమురయ్య ఉన్నారు.